నిరుద్యోగుల ఎదురుచూపు

ఇంటికో ఉద్యోగం వచ్చేంతవరకు నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు, సూపర్ సిక్స్‌లో భాగంగా ఆడబిడ్డ నిధి పథకం కింద 19 ఏళ్లు నిండిన ప్రతి ఒక్క మహిళకు నెలకు రూ.1500 ఆర్థిక సహాయం ఇస్తానంటూ ఎన్నికల సమయంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తయినా నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధిపై నోరు మెదపకపోవడం నిరుద్యోగులు, మహిళలను ఆందోళనకు గురిచేస్తోంది. యువతీయువకులకు భారీ సంఖ్యలో కొలువులు వస్తాయని, లేదంటే నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి అందుతుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు. –పాలసముద్రం



- నిరుద్యోగ భృతి కోసం ఆరాటం
- అటకెక్కిన చంద్రబాబు సూపర్‌సిక్స్ హామీలు
- అధోగతి పట్టిన ఆడబిడ్డ నిధి
- హామీల అమలుపై అనుమానాలు

సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా 19 ఏళ్ల నుంచి 59 ఏళ్లలోపు మహిళలకు ప్రతినెల రూ.1500 చొప్పున బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తామని పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటినా ఆ హామీ ఆచరణకు నోచుకోవడం లేదు. కుట్రలో భాగంగా పీ–4 పథకంలోకి ఆడబిడ్డ నిధిని తోసేసి ఇచ్చామన్నట్లు కలరింగ్ ఇచ్చి మహిళలను నట్టేట ముంచేస్తోంది.

ఉద్యోగాల కోసం ఆవేదన

మండలంలో డిగ్రీ అర్హతతో ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్స్ పరీక్షలతో పాటు బీఈడీ, టీడీసీ, ఇంటర్మీడియెట్, పదో తరగతి అర్హతతో ప్రభుత్వ కొలువుల కోసం ఆశ పడేవారు 3 వేల మంది నిరుద్యోగులు ఉన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు తమ ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ నిరుద్యోగులకు పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటించారు. 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనతోపాటు ఉద్యోగం వచ్చేంతవరకు ప్రతి ఒక్కరికి నెలకు రూ.3 వేలు భృతి ఇస్తామంటూ ఎన్నికల్లో ప్రచారం చేశారు. దీంతో నిరుద్యోగులు ఎంతో ఆశతో ఉద్యోగాలు కోసం ఎదురు చూస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ హామీని అమలు చేయడంలో జాప్యం చేస్తుండడంతో నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ పాత పాటే..

2014లో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.2 వేలు భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని ప్రగల్భాలు పలికారు. 2019 ఎన్నికల ముందు రూ.2 వేలు భృతి ఇస్తామని చెప్పి, వెయ్యి ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు. అలాగే ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి మిన్నకుండిపోయారు. ఇప్పుడు కూడా చంద్రబాబు మోసం చేస్తారేమోనన్న అనుమానం నిరుద్యోగుల్లో నెలకొంది.

గతంలో మహిళలకు పెద్దపీట

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళల చేతికి చేరిన డబ్బు వృథా కాకుండా ఇంటి అవసరాలకే ఉపయోగపడుతుందని భావించి, అనేక పథకాల డబ్బును మహిళల ఖాతాకే జమ చేశారు. అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం, సున్నావడ్డీ రుణాలు, వైఎస్సార్ చేయూత తదితర అనేక ముఖ్యమైన పథకాలన్నింటిని మహిళలకు అందజేశారు. అయితే కూటమి మోసాలకు మహిళలు, యువత ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు.

ఆడబిడ్డ నిధి ఎక్కడ?



కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా హామీలు నెరవేరలేదు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు రూ.1500 ఇస్తామని ఎన్నికల హామీ ఇచ్చిన చంద్రబాబు ఎప్పుడు ఆడబిడ్డ నిధి అందజేస్తారో తెలియలేదు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఆడబిడ్డలు కోరుతున్నారు.
–అనురేఖ, ఆముదాల, సర్పంచ్

ప్రభుత్వానిది వంచన



కూటమి ప్రభుత్వం మహిళలను వంచనకు గురి చేసింది. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచినా ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయకపోవడం మహిళలను మోసం చేయడమే. ఇప్పటికైనా ప్రభుత్వం ఆడబిడ్డ పథకం అమలు చేసి మహిళలపై చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి.
–లిల్లీ, సర్పంచ్, వెంగళరాజుకుప్పం

ఎప్పుడిస్తారో చెప్పాలి



కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను ఎప్పుడు నెరవేరుస్తుందో వెంటనే చెప్పాలి. ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం పథకాన్ని అమలు చేయాలి. దీంతోపాటు ఏడాదిన్నర బకాయిలు కూడా వెంటనే చెల్లించాలి.
–రాణి, మాజీ సర్పంచ్, పాలసముద్రం

హామీలు నెరవేర్చాలి



సూపర్ సిక్స్‌లో భాగంగా ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయాలి. పేద మహిళలకు వెంటనే నెల నెలా రూ.1500 ఇవ్వాలి. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేస్తుందని ఆశిస్తున్నాం.
–ఎస్ నందిని, పాలసముద్రం, బీసీ కాలనీ

ఎదురు చూపేనా?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2 లక్షల ఉద్యోగాలు, లేని పక్షంలో రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అధికార పగ్గాలు చేపట్టి ఏడాదిన్నర పూర్తి అయినా అతీగతీ లేదు. అసలు ఇస్తారా లేదా అనే విషయంపైనా స్పష్టత లేదు. 2019 ఎన్నికల ముందు తూతూ మంత్రంగా ఇచ్చారు. ఇప్పుడు అదే పంథా కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్నారు.
–రజినీ, ఆముదాల

ఎన్నికల హామీలన్నీ నెరవేర్చాలి



జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. గతంలో మాదిరి కాకుండా తక్షణమే భృతిని ప్రకటించాలి. ఒక్క నెల నోటిఫికేషన్ ఆలస్యమైనా ఉద్యోగానికి లక్షలాది మంది వయోపరిమితి దాటి ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత కోల్పోతారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ప్రతి ఇంటికీ ఉద్యోగం ఇవ్వాలి. లేకుంటే నిరుద్యోగ భృతిని అమలు చేయాలి. –ధనుంజయులు, సీఎం కండ్రిగ, నిరుద్యోగి

మాట నిలుపుకోవాలి



కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతిపై మాట నిలుపుకోవాలి. ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర పూర్తి అయినా దీనిపై సీఎం చంద్రబాబుతోపాటు మంత్రి లోకేష్ ఇంతవరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. దీనిపై మాలాంటి నిరుద్యోగుల్లో అనుమానం కలుగుతోంది. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలపై సీఎం చంద్రబాబు స్పష్టత ఇవ్వాలి.
–అరుల్, ఆముదాల, నిరుద్యోగి

క్లుప్తంగా

వ్యాధులపై అవగాహన



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గంగాధరనెల్లూరు: రాష్ట్ర వ్యాధుల నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు కోర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ గురు ప్రకాష్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై చిన్నచూపు లేకుండా సమాజంలో గౌరవించాలని కోరారు. ఈ వ్యాధులపై టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కోర్ ప్రాజెక్ట్ మేనేజర్ సద్దాం, సీహెచ్ఓ కృష్ణయ్య, సూపర్‌వైజర్ భగవతి, మండల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు పాపిరెడ్డి, ఓఆర్‌డబ్ల్యూ రేవతి, దుర్గ, సరిత, ఏఎన్ఎం మోతీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



మోటారు అమర్చుతున్న జెడ్పీటీసీ అన్బలగన్

పాలసముద్రం: మండలంలోని కేజే పురం పంచాయతీ ఇందిరానగర్ గ్రామానికి జెడ్పీ నిధుల నుంచి కొత్త బోరు వేసి, మోటారు అమర్చి ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఇందుకోసం చొరవ చూపిన జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్‌ను శుక్రవారం గ్రామస్తులు అభినందించారు. గ్రామ ప్రజలు మాట్లాడుతూ చాలా రోజులుగా ఇందిరానగర్ గ్రామ ప్రజలకు తాగునీటి కష్టాలపై జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. వెంటనే ఆయన జెడ్పీ నిధులు రూ.5 లక్షలు మంజూరు చేసి కొత్త బోరు వేశారని, మోటారు అమర్చి తాగునీటి సమస్య పరిష్కరించారని తెలిపారు. ఆయన్ను గ్రామ ప్రజలు అభినందించి, సన్మానించారు.

గిరి బలిజల ప్రకటన జీఓ రద్దు చేయాలి



ఏఓకు వినతిపత్రం అందిస్తున్న కాపు నేతలు

నగరి: గిరి బలిజ కుల ప్రకటన జీఓను వెంటనే రద్దు చేయాలని నగరి నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షుడు ఎంవీ బాబు కోరారు. శుక్రవారం ఈ అంశంపై స్థానిక బలిజ సంఘం సభ్యులతో కలిసి ఆర్డీఓ కార్యాలయంలో ఏఓ శివశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొమ్మరి కులాన్ని గిరి బలిజలుగా మార్చుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీఓను రద్దు చేయాలన్నారు. ఈ అంశంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అన్ని మండలాల్లో కాపు సంఘ నేతలు తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేయాలని పిలుపునిచ్చారు. కాపు సంఘం రాష్ట్ర నాయకుడు గోపీరాయల్ మాట్లాడుతూ జీఓను ప్రభుత్వం వెంటనే రద్దు చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘ సభ్యులు, శేఖర్, మణికంఠ, కదిరి వేలు, మల్లికార్జున పాల్గొన్నారు.

మేధో సంపత్తితో ఆర్థిక పురోగతి



వెబినార్‌లో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

పుత్తూరు: సమాజాభివృద్ధి, ఆర్థిక పురోగతికి భౌతిక ఆస్తులు ఎంత అవసరమో మేధో సంపత్తి సైతం ఎంతో కీలకమని ఎస్వీ కామర్స్, మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆధునిక సమకాలీన వ్యవస్థలో చట్టపరమైన మేధో సంపత్తి హక్కులు అనే అంశంపై జాతీయ అంతర్జాల సదస్సు(వెబినార్) నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మేధో సంపత్తి ప్రాముఖ్యతతో ఆర్థిక పురోగతి అంశాన్ని విశదీకరించారు. న్యాయపరమైన హక్కులనే మేధో సంపత్తి హక్కులంటారని తెలిపారు. వీటిలో పేటెంట్లు, కాపీరైట్లు, ట్రేడ్ మార్కులు, భౌగోళిక సూచికలు ముఖ్యమైనవని తెలిపారు. కార్యక్రమంలో మహబూబ్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.సరేష్ ప్రధాన వక్తగా వ్యవహరించారు. సంచాలకులుగా కామర్స్ అధ్యాపకుడు తిరుమలయ్య వ్యవహరించారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 450 మంది అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్లు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు ఈ వెబినార్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వధూవరులకు మాజీ మంత్రి ఆశీస్సులు



నూతన వధూవరులతో మాజీ మంత్రి

నగరి: మండలంలోని అడవికొత్తూరు ఆదిఆంధ్రవాడలో జరిగిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆదిఆంధ్రవాడ కార్యదర్శి నాని వివాహ మహోత్సవంలో శుక్రవారం మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వించారు. ఆమె వెంట ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మేధావుల విభాగం రాష్ట్ర కార్యదర్శిగా రాజన్



రాజన్

శ్రీరంగరాజపురం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలానికి చెందిన ఆ పార్టీ నాయకుడు రాజన్‌ను మేధావుల విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తున్నట్లు కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా గంగాధరనెల్లూరు ప్రెస్ క్లబ్‌లో రాజన్ మాట్లాడుతూ తాను పార్టీ అభివృద్ధి చేసిన సేవలను గుర్తిస్తూ ఈ పదవి రావడానికి కృషి చేసిన మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, జీడీనెల్లూరు సమన్వయ కర్త కృపాలక్ష్మికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీపై అవగాహన

గంగాధరనెల్లూరు: జీడీ నెల్లూరు మండలానికి 19,500 స్మార్ట్ రేషన్‌కార్డులు వచ్చాయని సెప్టెంబర్ ఒకటి నుండి రేషన్ షాపుల ద్వారా ప్రజలకు అందజేస్తామని తహశీల్దార్ సి.కె.శ్రీనివాసులు తెలిపారు. గంగాధరనెల్లూరు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పౌరసరఫరాల శాఖ యాప్ ద్వారా పంపిణీ చేసే స్మార్ట్ రేషన్‌కార్డుల వినియోగంపై రెవెన్యూ సిబ్బందికి, డీలర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో డీటీ మహేష్, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణపై ప్రత్యేక దృష్టి



శిక్షణలో మాట్లాడుతున్న ఆర్డీఓ

నగరి: బాల్య వివాహాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్డీఓ అనుపమ అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో డివిజన్ స్థాయి అధికారులకు నిర్వహించిన ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల చట్టాలపై అవగాహన, బాల్య వివాహాల నిర్మూలన చేపట్టడమే శిక్షణ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. బాలలకు సంబంధించిన చట్టాలు, శిక్షలు బాల్యవివాహాలు నిరోధక చట్టం 2006, బాలలపై లైంగిక నిరోధక చట్టం, ఉచిత నిర్బంధ విద్య, లింగ నిర్ధారణ పరీక్ష చట్టం తీవ్రతను క్షుణ్ణంగా వివరించారు. గ్రామస్థాయి సీఎం వీఓల ఫోన్ నెంబర్లను ప్రతి స్కూల్‌లో నోటీస్ బోర్డులో ఉంచాలని, వారు విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. సమాజంలో బాలలపై జరుగుతున్న అకృత్యాలను ఆపడంతోపాటు మూఢ నమ్మకాలతో జరిగే అనర్థాలపై సమాజానికి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి వార్డు, గ్రామ సచివాలయ పరిధిలో దీనిపై ఒక రిజిస్టరు నిర్వహణలో ఉంచాలన్నారు. డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ డాక్టర్ దాసరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బాల్య వివాహాల చట్టం, లైంగిక నేరాల చట్టాలపై శిక్షణ అందించారు. లీగల్ ప్రొబెషన్ ఆఫీసర్ ఎంఎస్ వెంకటేశులు, ప్రొటెక్షన్ ఆఫీస్ నాన్ ఇన్‌స్టిట్యూషనల్ కేర్ సి.శివశంకర్ అడాప్షన్ ప్రాసెస్, స్పాన్సర్‌షిప్ గురించి వివరించారు. ప్రొటెక్షన్ ఆఫీసర్ ఇన్‌స్టిట్యూషనల్ కేర్ రాధా రాణి మాట్లాడుతూ చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్ సేవలను వివరించారు. చైల్డ్ హెల్ప్ లైన్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ నాగమణి 1098 సర్వీస్, ఉమెన్ హెల్ప్ లైన్ అండ్ సర్వీసెస్ 181 వివరించారు. డీఎం అండ్ హెచ్ఓ జయరాముడు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమన్న అంశాన్ని వివరించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓలు, ఎంపీడీఓలు, మెడికల్ ఆఫీసర్లు, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, వార్డ్ అండ్ విలేజ్ సెక్రెటరీలు, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ సిబ్బంది, చైల్డ్ హెల్ప్ లైన్ సర్వీసెస్ సిబ్బంది, ఉమెన్స్ హెల్ప్‌లైన్ సర్వీసెస్ సిబ్బంది పాల్గొన్నారు.

జయశ్రీకి మాజీమంత్రి ఆర్కే రోజా పరామర్శ



వైద్యులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి రోజా

నింద్ర: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి శ్యామ్‌లాల్ భార్య, రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ డైరెక్టర్ జయశ్రీని శుక్రవారం వైద్యశాలలో మాజీ మంత్రి ఆర్కే రోజా పరామర్శించారు. జయశ్రీ వెన్నెముక శస్త్రచికిత్స చేసుకుని తిరుపతి నారాయణాద్రి హాస్పిటల్ ఐసీయూలో ఉన్నారు. ఆమెను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

గంగ జాతరకు ఆహ్వానం



మాజీ మంత్రిని ఆహ్వానిస్తున్న గంగజాతర కమిటీ సభ్యులు

పుత్తూరు: పుత్తూరులో వచ్చే నెల 3వ తేదీన నిర్వహించనున్న గ్రామ దేవత పిడికిలి గంగమ్మ జాతరకు రావాలంటూ జాతర కమిటీ వారు మాజీ మంత్రి ఆర్కే రోజాను ఆహ్వానించారు. శుక్రవారం నగరి పట్టణంలోని మాజీ మంత్రి నివాసానికి విచ్చేసిన వారు ఆహ్వాన పత్రికను ఫల పుష్పాలతో ఆమెకు అందించారు. ఈ నెల 31వ తేదీన చాటింపు ఉంటుందని, వచ్చే నెల 1, 2 తేదీల్లో గెరిగ ఊరేగింపు, 3వ తేదీన జాతర ఉంటుందని తెలియజేశారు. గంగజాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడల్లో వడమాలపేటకు హ్యాట్రిక్ అవార్డు



అవార్డు అందుకుంటున్న జయప్రద, చంద్రశేఖర్‌రాజు

వడమాలపేట(పుత్తూరు): ప్రభుత్వం ఏటా జిల్లా స్థాయిలో ఇచ్చే స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డును వడమాలపేట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వరుసగా మూడోసారి కైవసం చేసుకొని హ్యాట్రిక్ సాధించింది. శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరుపతి ట్రెండ్స్ జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్వ శిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ గౌరీశంకర్, అసిస్టెంట్ మానిటరింగ్ ఆఫీసర్ సురేష్ చేతుల మీదుగా వడమాలపేట ఇన్‌చార్జి హెచ్ఎం జయప్రద, పీడీ చంద్రశేఖర్‌రాజు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డును అందుకొన్నారు. ఈ అవార్డుతో హ్యాట్రిక్ కొట్టినందుకు జయప్రద, చంద్రశేఖర్‌రాజులను జిల్లా అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

క్రీడలతో ఒత్తిడి దూరం

కార్వేటినగరం: క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఒత్తిడి దూరమవుతుందని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం శేఖర్ అన్నారు. హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణంలో విద్యార్థులకు పలు క్రీడలను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యాయామం, క్రీడలకు కొంత సమయం కేటాయించడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు జయదేవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాతృభాషపై మమకారం అవసరం





తెలుగు భాషాదినోత్సవంలో డీఎంపురం విద్యార్థులు, పుత్తూరులో బహుమతులు అందుకున్న విద్యార్థులు

కార్వేటినగరం: మాతృభాషతోనే మానవ జాతి మనుగడ సాధ్యమని డీఎంపురం ఉన్నత పాఠశాల హెచ్ఎం నాదమునిరెడ్డి అన్నారు. శుక్రవారం తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా గిడుగు వెంకటరామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి ఉపాధ్యాయులతో కలసి నివాళులర్పించారు. విద్యార్థులకు తెలుగులో వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఓ విద్యార్థిని తెలుగు తల్లి వేషధారణలో పలువురిని ఆకట్టుకుంది. విద్యార్థులకు పాఠశాల కమిటీ చైర్మన్ త్యాగరాజు విందు భోజనం అందించారు. ఉపాధ్యాయులు సరస్వతి, మాలతి, ఢిల్లీబాబు, రాములు, వ్యాయామ ఉపాధ్యాయుడు కిషోర్‌కుమార్, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

పాలసముద్రం: మండలంలోని పాలసముద్రం ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం ప్రధానోపాధ్యాయిని మీనాక్షి సమక్షంలో తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో పాఠశాలకు హాజరయ్యారు. విద్యార్థినులు నృత్యాలు వేసి అలరించారు. అనంతరం గిడుగు వెంకట రామ్మూర్తి, హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

తెలుగు భాష పరిరక్షణకు కృషి

పుత్తూరు: తెలుగు భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి.చంద్రమౌళి పిలుపునిచ్చారు. శుక్రవారం కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రాచీన భాషల్లో ఒకటైన తెలుగు భాషను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, ఎంబీబీఎస్ తదితర కోర్సుల్లో తెలుగును ప్రవేశపెట్టాలని తీర్మానం చేశారు.

నగరిలో..

నగరి: తడుకుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు భాషా నిపుణులు, సాహితీవేత్తలు, ఉపాధ్యాయులు తెలుగు భాష గొప్పదనాన్ని వివరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూజలు చేశారు. తెలుగు భాషపై నిర్వహించిన పోటీలో విజేతలకు ప్రిన్సిపల్ వెంకటాచలపతి బహుమతులు అందించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ వేణుగోపాల్ అధ్యక్షతన తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు.

అలరించిన విద్యార్థుల అష్టావధానం

వడమాలపేట(పుత్తూరు): తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఎస్వీపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిర్వహించిన అష్టావధానం అందరిని అలరించింది. పిల్లలు పద్యాలను రాగయుక్తంగా ఆలపించి ఆకట్టుకొన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పద్యాల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నరేష్, ఉపాధ్యాయులు రంగయ్య, ఓంకార్, నరసింహారెడ్డి, సుదర్శన్, దామోదర్, విద్యార్థులు పాల్గొన్నారు. మరో కార్యక్రమంలో పుత్తూరులోని శ్రీచైతన్య పాఠశాలలో మాతృ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఏజీఎం సురేష్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శరవణ, జోనల్ డీన్ మోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీడీనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: జీడీ నెల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయుడు సుబ్బరామయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు దేవరాజులురెడ్డి, తెలుగు ఉపాధ్యాయిని గజలక్ష్మీ, ఝాన్సీరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా గణేష్ నిమజ్జనం

- వేలంలో పదివేలకు పైగా పలికిన లడ్డు

నగరి: వినాయక చవితిని పురస్కరించుకుని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భారీ వినాయక ప్రతిమలు శుక్రవారం నిమజ్జనానికి ఊరేగింపుగా తరలాయి. ఈ సందర్భంగా వినాయక శిబిరాల వద్ద భక్తిపాటలతో హోరెత్తించారు. అనంతరం వినాయక ప్రతిమలను ట్రాక్టర్లలో ఎక్కించారు. బాణసంచా వేడుకల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. కుప్పిరెడ్డి కండ్రిగ, బుగ్గ దేవాలయం సమీపంలోని గుంటలు, కీళపట్టు కుశస్థలి నది వద్ద వినాకయ ప్రతిమలను నిమజ్జనం చేశారు.

రూ.11,600 పలికిన లడ్డు

బస్టాండు ప్రాంతంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఉంచిన లడ్డూను వేలం వేయగా నగరి పట్టణానికి చెందిన భాస్కర్ లడ్డూను రూ.11,600 వేలంలో పాడుకున్నారు. గణేశ్ లడ్డు ఇంటికి తీసుకెళ్తే శుభం కలుగుతుందని, అందుకే గత నాలుగేళ్లుగా తానే లడ్డును వేలంలో పాడుకుంటున్నానని భాస్కర్ తెలిపారు.





బస్టాండు ప్రాంగణంలో నిమజ్జనానికి వినాయక ప్రతిమ, కుప్పిరెడ్డికండ్రిగ వద్ద నీటిలో వినాయక నిమజ్జనం





లడ్డును తలపై తీసుకెళ్తున్న భాస్కర్, చావడి ప్రాంతంలో తరలుతున్న వినాయక ప్రతిమ